4న ఘంటసాల జయంతి

రవీంద్రభారతి, డిసెంబర్ 1 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ పౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4.30కు రవీంద్రభారతిలో ఘంటసాల 102వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, బొక్క భీంరెడ్డి, గాయని ఆమని ఒక ప్రకటనలో తెలిపారు. గాయని శైలజకు ఘంటసాల జీవన సాఫల్యపురస్కారం బహూకరణ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క. కోలేటి దామోదర్‌గప్తా, సుద్దాల అశోక్‌తేజ హాజరవుతారని తెలిపారు. అనంతరం గాయని అమని బృందంచే సీల్‌వెల్ సుస్వరాలు 66 కార్యక్రమం ఉంటుందని అన్నారు.

తెలంగాణ సంస్కృతిని తెలుసుకోవాలి

విద్యా దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి

కాచిగూడ, డిసెంబర్ 1: తెలంగాణ సంస్కృతి, సంప్రాదాయలను విద్యార్థులు బాధ్యతగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి సూచించారు. కృష్ణానగర్‌లోని ఆజంపుర పాఠశాలలో తెలంగాణ విద్యా దినోత్సవంలో భాగంగా ఆదివారం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

నవజీత్‌సంకలా

మెహిదీపట్నం, డిసెంబర్ 1 : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు కనిపించకుండా పోయిన ఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గోషామహల్‌లో జ్ఞాన్‌బాగ్ కాలనీలో నివసించే నవజీత్ సంకలా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుదర్యాప్తులో ఉంది.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిక్కడపల్లి, డిసెంబర్1: అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి మారయ్య అన్నారు. సంఘం ఆధ్వర్యంలో చైతన్య సమావేశం ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపాటి జైపాల్, బారతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ.. వడ్డెరుల సంఘటితంగా ముందుకు సాగాలని అన్నారు. వడ్డెరుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చస్తానని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారానికి ఎస్‌కే మిశ్రో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణాచారి

- 5న తెలుగు వర్సిటీలో మిశ్రోకు రూ. 20వేల నగదుతో పాటు పురస్కారం ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 1: ప్రఖ్యాత రంగస్థల, టీవీ, చలనచిత్ర నటుడు, దర్శకుడు ఎస్.కె. మిశ్రో నాటకరంగానికి చేసిన కృషికి గాను చాట్ల శ్రీరాములు పేరిట నెలకొల్పిన ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, రసరంజని అధ్యక్షుడు డాక్టర్ కె.వి. రమణాచారి వెల్లడించారు. రెడ్‌హిల్స్‌లోని రమణాచారి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో చాట్ల శ్రీరాములు 93వ జయంతి వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో డిసెంబర్ 5న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటకరంగమే తపస్సుగా భావించిన చాట్ల శ్రీరాములు నిత్య కృశీవలుడని, ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకుని నాటకరంగ కళాకారులకు మార్గదర్శకంగా నిలిచారని గుర్తు చేశారు. చాట్ల శ్రీరాములు సంకల్పం మేరకు 1999నుంచి ప్రతి ఏటా నాటకరంగ విశిష్టునికి రూ.20వేల నగదుతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. ఈ సంవత్సరం ఎస్.కె మిశ్రోను ఈ అవార్డుకు కమిటీ సభ్యులు ఎంపిక చేశారని ఈ నెల 5న పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించనున్నట్లు వివరించారు. సమాజంలోని సమస్యలకు అద్దంపట్టే అంశాలతో యువభేరి థియేటర్ నిర్వహణలో నా శత్రువు నాటికను ఈ సందర్భంగా పలువురు నటీనటులు వేదికపై ప్రదర్శిస్తారని రసరంజని కార్యదర్శి కేతినీడి నటరాజు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ అంబేద్కర్‌నగర్ గుండు పోచమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని పూజలను నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వసంత్‌రెడ్డి, ఉపాధ్యకులు కోయల్‌కార్ గోవింద్‌రాజ్, నాయకులు కిట్టుగౌడ్, కోయల్‌కార్ శ్రీనివాస్, బాలప్రసాద్ తివారి, ఆరెళ్ల వెంకటేశ్‌యాదవ్, నందకిశోర్, చిరు తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 1

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించడానికి ఎంఐఎం నిరంతరం పనిచేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి హకీంపేట్‌లలో రూ.11,47 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే అందించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 1

వేడుకగా కార్తిక మాస వనభోజనాలు



కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రమేశ్, అంబర్‌పేట పద్మశాలి సంఘం కార్యవర్గం

అంబర్‌పేట, డిసెంబర్ 1 : అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన కార్తిక మాస వనభోజనాలు, విద్యార్థులకు ప్రతి భా పురస్కారాల కార్యక్రమం వేడుకగా సాగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరై మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగుతూ రాజకీయంగా ఎదగాలని అన్నారు. ఆత్మీయ అతిథులుగా అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజినీర్స్ విభాగ్ సంఘ్ అధ్యక్షుడు డా. పుట్ట పాండు రంగయ్య, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డా.మార్త రమేశ్, ప్రొ.తాటికొండ వెంకటరాజయ్య, నియోజకవర్గం గౌరవాధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, మహిళా నాయకురాలు డా. వగ్గు సమత, పోరండ్ల శారద, స్వప్న, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్ హాజరయ్యారు. అనంతరం పదోతనగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివ్ కుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షుడు ఎలగంధుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, కుందెన సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు గంజి వెంకటరమణ, పెద్దబొమ్మ మధుసూదన్, తీగల నరేందర్, కార్యదర్శులు బోగ వెంకటయ్య, గండెమల్లి శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేశ్, ప్రచార కార్యదర్శి వనంరమణ, కార్యవర్గ సభ్యులు రాజేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే కాలేరు పూజలు

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి, స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామిని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. – అంబర్‌పేట, డిసెంబర్ 1

దంతవైద్యులకు సన్మానం

ఏషీయన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్ సొసైటీలో డాక్టర్లు

అబిడ్స్, డిసెంబర్1 : ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్ డెంటిస్ట్ సొసైటి వారి 13వ వార్షిక సన్మానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 7వందలకు పైగా అనుబంధ ప్రాంతీయ డెంటల్ చారిటబుల్ హాస్పిటల్స్‌లో సేవలందించిన డెంటిస్టుల కృషిని గుర్తించి సన్మానించారు. అనంతరం వారికి ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం దేశం నలుమూలల నుంచి అర్హత పొందిన డెంటిస్టులు తమ ప్రాంతీయ హస్పటల్లలో చేరి రోగులకు సెవలందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ డెంటల్ అసొసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.ఎన్. స్వామి హాజరై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మిడ్స్ ప్రిన్సిపాల్ నిజామబాద్, ప్రతాప్ కుమార్, డాక్టర్ చలపతిరావు, డాక్టర్ రాకేశ్ మొహదే, డాక్టర్ అవినాష్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ బాల సునీల్‌కుమార్, డాక్టర్ సత్యనారాయణ నాయుడు పాల్గొన్నారు.

సంగీత కచేరి

కార్తిక మాసం సందర్భంగా తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో ఆదివారం నాంపల్లి విజయనగర్ కాలనీకి చెందిన సంగీత గురువు వింజమూరి లక్ష్మి తన శిష్యబృందంతో భక్తి సంగీత కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య, త్యాగరాజ రచనలలోని పలు కృతులు, వర్ణాలను గానం చేసి సంగీత ప్రియులను అలరించారు.

– తెలుగు యూనివర్సిటీ

హనుమాన్ ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ

తాళ్లగడ్డ హనుమాన్ ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్‌లు మిత్ర కృష్ణ, బంగారి ప్రకాశ్ పాల్గొని అయ్యప్పస్వామికి పూజలు చేశారు.

– హిదీపట్నం, డిసెంబర్ 1

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్, సిబ్బంది

కాచిగూడ,డిసెంబర్ 1: ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పుర చమాన్‌లో స్పెషల్ డ్రవ్ నిర్వహించి, హెల్మెట్ వాడకం, ఓవర్‌టేక్, రాంగ్ రూట్‌లో వెల్లడంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరుగవని అన్నారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

నూతన మోటర్‌ను బిగిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్, డిసెంబర్ 1: తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రెండో వార్డు అన్నానగర్ మైసమ్మ ఆలయం వద్ద పవర్ బోర్‌వెల్‌కు బోర్డు అధికారులు కొత్త మోటార్‌ను ఇచ్చారు. దీంతో స్థానిక నేతలతో కలిసి ఆయన బిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన మోటార్ బిగించి ప్రజల నీటి అవసరాలు తీర్చామని తెలిపారు. ఆదేవిధంగా రెండో వార్డులో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ రెండో వార్డు అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, నేతలు శ్యామ్ రెడ్డి, దేవరాజ్ పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి

అధికారులను ఆదేశించిన మాజీ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం , డిసెంబర్ 1 : అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద గోల్కొండ నుంచి కోల్ల పడకల్ పోయే రెండు లైన్ల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గాదె థామస్ రెడ్డి, మాజీ సర్పంచులు బండారు లింగం ముదిరాజ్, మంత్రి రాజేశ్, రంగారెడ్డి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంఎ సమీర్, రమేశ్, మల్లేశ్, శ్రీకాంత్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డు పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉంటే ఎలా ప్రయాణం చేస్తారని అధికారులను ఆమె ప్రశ్నించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని అన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని మాజీ మంత్రి సబితారెడ్డిని కోరుతున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్, మాజీ సర్పంచుల బృందం

తెలంగాణ అమరుడు పోలీస్ కిష్టయ్య

కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు, డిసెంబర్ 1 : తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం మండల కేంద్రం లో శ్రీశైలం జాతీయ రహదారిపై ఆయన చిత్రపటానికి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాండు ముదిరాజ్ మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొర్వి సురేందర్ ముదిరాజ్, నల్లి సుదర్శన్ ముదిరాజ్, బాల్‌రాజ్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు కాకి రాములు ముదిరాజ్, మామిళ్ల ప్రవీణ్ ముదిరాజ్, తాళ్ల నరేందర్ ముదిరాజ్, నల్లి శ్రీధర్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, వినోద్ ముదిరాజ్, బాబు ముదిరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

కాంపాటి విష్ణు (ఫైల్)

హయత్‌నగర్, డిసెంబర్ 1 :కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెద్దఅంబర్‌పేటకు చెందిన కాంపాటి విష్ణు(17), వర్డ్ అండ్ డీడ్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శనివారం ఉదయం 8 గంటలకు కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన విష్ణు ఇంటికి రాలేదు. దీంతో తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఈఓ ఉద్యోగ విరమణ

డేవిడ్ దంపతులను సన్మానించిన రాజ్‌కుమార్, ఎం. భాస్కర్ తదితరులు

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 1 : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వి. డేవిడ్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డేవిడ్ దంపతులను జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉపాధ్యక్షుడు రుగేష్, సంయుక్త కార్యదర్శులు ఎంఏ ముక్తధర్,జయంతి రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శి ఫెరోజ్, కార్యవర్గ సభ్యులు ప్రియాదేవ్ ఠాకూర్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

బాబాజీ గణపతి

మేడ్చల్, డిసెంబర్ 1: విద్యార్థి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గౌడవల్లి గ్రామానికి చెందిన గణపతి ఆనందరావు కుమారుడు బాబాజీ గణపతి(16) మేడ్చల్ పట్టణంలోని ఆక్స్ ఫార్డ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. గతనెల 26న ఉదయం పాఠశాలకు వెళ్తున్న అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. కానీ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బాబాజీ తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ నేత బ్రహ్మచారి గుండెపోటుతో మృతి

పడకంటి బ్రహ్మచారి(ఫైల్)

అంబర్‌పేట, డిసెంబర్ 1 : అంబర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడకంటి బ్రహ్మచారి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఓబీసీ నాయకుడైన బ్రహ్మచారి గతంలో బీజేపీలో క్రియాశీల కార్యకర్తగా పని చేశారు. మాజీ ఎమ్మెల్యే దివంగత ఆలె నరేంద్ర శిష్యుడైన బ్రహ్మచారి ఒక సారి అంబర్‌పేట డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే బ్రహ్మచారి ఆకస్మిక మృతి పట్ల పలువురు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్నా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ బ్రహ్మచారి కుమార్తె హరిప్రియతో టెలిఫోన్‌లో మాట్లాడి సంతాపాన్ని తెలియజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ కూడా తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఆర్థిక సాయంగా చెక్కును అందజేస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి, డిసెంబర్ 1: రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంక్షేమ సమితి 5వ వార్షికోత్సవ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న ఒక్కో రైతు కుటుంబానికి రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు న్యాయమైన ధర లభించడం లేదని తెలిపారు. రైతులందరికీ రైతు బీమా కల్పించాలని, అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని అన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త బాబూరావు, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సొగరాబేగం, ఏలేశ్వరం వెకంటేశ్, న్యాయవాది లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ వెంకట రాజయ్య, ఎంఏ అజీజ్, గోవర్ధన్ , నర్సింహ పాల్గొన్నారు.

'కేంద్రంపై.. చార్జిషీట్ వేయాలి'

అబిడ్స్, డిసెంబర్ 1 : రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై చార్జిషీట్ వేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు.గాంధీ భవనలో అదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే కనీసం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించక పోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల వివక్ష చూపుతున్న కేంద్రాన్ని నిలదీసి నిధుల కోసం పోరాటం చేయాలని అన్నారు.

పుదుచ్చేరి రైల్లో దొంగతనం

కాచిగూడ, డిసెంబర్ 1: పుదుచ్చేరి రైల్లో ప్రయాణికుని బైనాక్యూలర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కొత్తపేటలోని ఆర్‌కే పురం ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ సీసీఎంబీలో రిసెర్చ్ స్కాలర్. పుదుచ్చేరి రైల్లో ఆదివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అనంతరం బ్యాగు చూసుకునేసరికి బైనాక్యూలర్ కన్పించలేదు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు మృతి

కాచిగూడ,డిసెంబర్ 1: అనారోగ్యంతో రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60) శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2లో అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై లేత పసుపు రంగు చొక్క, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.2 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.